ఆర్‌యూ పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 9: రాయలసీమ విశ్వ విద్యాలయం పరిధిలో జరిగిన పీజీ మూడో సెమిస్టర్ (ఫిబ్రవరి-2024) పరీక్షల ఫలితాలను శుక్రవారం వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు విడుదల చేశారు. ఈ ఫలితాల వివరాలు వర్సిటీ వెబ్‌సైట్ 'రాయలసీమ యూనివర్సిటీ డాట్ ఏసీ డాట్ ఇన్‌లో చూసుకోవచ్చని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 9: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఆదివాసీలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ పి.రంజిత్ బాషా, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవ ప్రపంచానికి దూరంగా ఉంటున్న ఆదివాసీల దృష్టిలో ఉంచుకుని జేనీవాలో 1982 సంవత్సరంలో అటవీ హక్కులను సంబంధించిన నిపుణులతో ఒక అధ్యయన కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో సుమారు 8.83 శాతం, రాష్ట్రంలో సుమారు 5.53 శాతం ఆదివాసీలు ఉన్నారని వెల్లడించారు. రాష్ట్రంలో 34 తెగల వరకు ఉంటాయని, అందులో 11 ప్రత్యేక గిరిజన దుర్బల తెగలు ఉన్నాయని వివరించారు. జిల్లాలో ఉన్నటువంటి అన్ని గిరిజన, బీసీ సంక్షేమ వసతి గృహాలకు పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు బీసీ సంక్షేమ వసతి గృహాలకు రూ.9 కోట్లు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు రూ.5 కోట్లు, గిరిజన సంక్షేమ వసతి గృహాలకు రూ.2 కోట్లతో అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించామని అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం నిర్వహించుకునేందుకు 1994లో ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసిందన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పత్తికొండలో ఉన్న 16-18 తండాల్లో సీసీ రోడ్లు, మంచినీటి సదుపాయం కల్పించామన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ గిరిజనుల కోసం ఈశాన్య రాష్ట్రాల్లో స్వయంప్రతిపత్తిగల కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి పరిపాలన సాగించే దిశగా భారత రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. జిల్లాలో గిరిజన అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు కలెక్టర్, పాణ్యం, కోడుమూరు, పత్తికొండ ఎమ్మెల్యేలు శాలువాలతో సన్మానించారు. సమావేశంలో డీఆర్వో కే మధుసూదన్‌రావు, ఇన్‌చార్జి గిరిజన సంక్షేమ అధికారి రంగలక్ష్మీదేవి, ఎరుకుల హక్కుల పోరాట సమితి జనరల్ సెక్రటరీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకుల రాజు, గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

రూ.1,800 కోట్లతో ఓర్వకల్లు పారిశ్రామికాభివృద్ధి

- ఫార్మా హబ్ ఏర్పాటుకు చర్యలు
- రైల్వేలైన్, నీటి నిల్వ రిజర్వాయర్ నిర్మాణం
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి ఇండస్ట్రియల్ నోడ్ పరిశీలన


ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత


మ్యాప్‌ను పరిశీలిస్తున్న టీజీ భరత్, గౌరు చరిత

ఓర్వకల్లు/కర్నూలు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శ్రీసిటీని మించి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి చేస్తామని, అందుకోసం రూ.1,800 కోట్లను కేటాయిస్తున్నట్లు పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి శుక్రవారం ఇండస్ట్రియల్ నోడ్ ప్రాంతంలో పర్యటించారు. గత వైసీపీ పాలనలో ధ్వంసం చేసిన రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు వేసిన శిలాఫలకాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి గుట్టపాడు గ్రామ సమీపంలో ఏపీఐఐసీ భూములు పరిశీలించారు. అక్కడే గత టీడీపీ ప్రభుత్వంతో చంద్రబాబు శంకుస్థాన చేసిన జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమను మంత్రి భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత పరిశీలించారు. ఆ పరిశ్రమ ఎండీ కొయాంక వారికి స్వాగతం పలికారు. స్టీల్ పరిశ్రమ నిర్మాణం, లక్ష్యాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కంపెనీ ప్రతినిధులు వివరించారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం మారుతి ప్రసాద్‌లు పది వేల ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ ఎలా అభివృద్ధి చేస్తున్నామో మంత్రి, ఎమ్మెల్యేలకు వివరించారు. మాస్టర్ ప్లాన్ పరిశీలించిన మంత్రి భరత్ పలు సూచనలు చేశారు. తిరుపతి శ్రీసిటీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. అక్కడ ఆ స్థాయిలో మౌలిక వసతులు ఉన్నాయి. శ్రీసిటీకి దీటుగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌లో మౌలిక వసతులు కల్పించడానికి అనుభవం కలిగిన సంస్థతో డీపీఆర్ తయారు చేయించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమలు ఇక్కడికి రావాలంటే రోడ్లు, నీరు, రైల్వే రవాణా, విమానయానం వంటివి ఎంతో ముఖ్యమన్నారు. పది వేల ఎకరాల్లో అధునాత సౌకర్యాలతో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ముచ్చుమర్రి లిఫ్ట్ నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోసి నిల్వ చేసే జలాశయం, దూపాడు నుంచి రైల్వేలైన్, ఓర్వకల్లు నుంచి విజయవాడకు విమాన సౌకర్యం కల్పిస్తామని అన్నారు. ఇది రెడ్ జోన్ కావడంతో ఫార్మా సహా అన్ని రకాల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం పెట్టుబడుల కోసం కృషి చేస్తే.. గత వైసీపీ ప్రభుత్వం చంద్రబాబు వేసిన ఇండస్ట్రియల్ మెగా హబ్ శిలాఫలకం ధ్వంసం చేశారని, వారికి ఉన్న పైశాచిక ఆనందం ఏపాటిదో తెలుస్తోందన్నారు. మళ్లీ చంద్రబాబు కాగానే పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ముందుకు వస్తున్నారన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ గతంలోనే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ మెగా హబ్ కోసం చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక హబ్‌ను విధ్వంసం చేశారన్నారు. దేవదాయ, వక్ఫ్ భూములను కబ్జా చేయడంపైనే వైసీపీ నేతలు దృష్టి పెట్టారే తప్పా యువత కోసం ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేదన్నారు. మంత్రి టీజీ భరత్ సహకారంతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధితో పాటు పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గుట్టపాడు సర్పంచ్ మోహన్‌రెడ్డి, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు సోమశేఖర్‌రెడ్డి, ఇండస్ట్రీస్ జీఎం మారుతి ప్రసాద్, ఏఈ సందీప్, ఓర్వకల్లు తహసీల్దారు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య చాలా కీలకం: ఆర్‌ఐవో

కోడుమూరు (రూరల్), ఆగస్టు 9: ప్రతి విద్యార్థికి ఇంటర్ విద్య కీలకమని ఆర్‌ఐవో గురవయ్య శెట్టి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆర్‌ఐవో, ప్రిన్సిపాల్ పద్మావతి అధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగులను అందజేశారు. కళాశాల ఫస్ట్ ఇయర్ విద్యార్థి షమీనా (ఎంపీసీ) 461/470 మార్కులతో ప్రతిభ కనబరచడంతో నగదు పురస్కారం అందించారు. విద్యార్థి తల్లిదండ్రులు చిన్నయ్య, ఫాతిమా దంపతులతోపాటు ప్రతిభ చూపిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. కళాశాల విద్యార్థులు ఎంసెట్, నీట్ వంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి సహకారం అందిస్తానని ఆర్‌ఐవో హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల నిర్మించిన పార్కు, బాత్రూంలను ప్రారంభించారు. పార్కు అభివృద్ధి పట్ల అధ్యాపకుల కృషిని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రాముడు, అధ్యాపకులు పాల్గొన్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆర్‌ఐవో

క్రిమినల్ నాయకుడు వైఎస్ జగన్

సీబీఐ కోర్టుకు ఎగ్గొట్టేందుకే ప్రతి శుక్రవారం ఓ కార్యక్రమం

వైఎస్ జగన్‌పై మండిపడిన మంత్రులు, ఎంపీ ఎమ్మెల్యేలు


మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 9: దేశంలోనే నంబర్‌వన్ క్రిమినల్ లీడర్ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని టీడీపీ రాష్ట్ర మంత్రులు ఎన్‌ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం నంద్యాలలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంత్రులు ఫరూక్, బీసీతో పాటు ఎంపీ బైరెడ్డి శబరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, భూమా అఖిల ప్రియ, గిత్తా జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యలకు, హత్యా రాజకీయాలకు దూరంగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు తమకు స్పష్టంగా చెప్పారన్నారు. ఇప్పటికైనా జగన్ హత్యా రాజకీయాలపై మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. హత్యా రాజకీయాలపై జగన్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో 2,686 హత్యలు జరిగాయని, వీటిపై కూడా కేసులు పెట్టాలని అన్నారు. వైఎస్ కుటుంబ చరిత్ర అంతా రక్త చరిత్రేనని వ్యాఖ్యానించారు. సీతారామపురంలో రెండు పార్టీల మధ్య గొడవ జరగలేదని కేవలం రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగిందని చెప్పారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ జగన్ పాలనలో వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలతో పాటు పంచాయతీల పేరుతో సామాన్య ప్రజలను హత్య చేసినపుడు ఎందుకు బాధితుల కుటుంబాన్ని పరామర్శించలేదని ఆమె సూటిగా ప్రశ్నించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ రాష్ట్రంలో 11 సీట్లకే వైసీపీని ప్రజలు పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదని, ఇకనైనా శవరాజకీయాలను మానుకోవాలన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ జగన్ చుట్టూ ఉన్న నాయకులు క్రిమినల్ మైండ్ ఉన్న వారేనని, ప్రతి దానికి రాజకీయ రంగు పులిమి ఏదో చేయాలకోవడం వైసీపీ నాయకులకే చెల్లుతుందన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ రాజకీయాలు హుందాగా వ్యవహరించాలే కాని అరాచకాలకు పాల్పడకూడదన్నారు. అందుకే ప్రజలు ఓటుతో జగన్ పార్టీకి బుద్ధి చెప్పారని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తులసి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్, నందికొట్కూరు నాయకుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకల్లో ఉద్యోగులు విధిగా పాల్గొనాలి

కర్నూలు(లీగల్), ఆగస్టు 9: ఈ నెల 15వ తేదీన రాష్ట్ర లోకాయుక్తలో స్వాతంత్ర్య వేడుకలు ఉదయం 9 గంటలకు జరుగుతాయని, లోకాయుక్త ఉద్యోగులందరూ అందరూ విధిగా పాల్గొనాలని లోకాయుక్త రిజిస్ట్రార్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. వేడుకల్లో భాగంగా రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అన్ని సెక్షన్ల అధికారులు, ఉద్యోగులు అందరూ పాల్గొనాలన్నారు. అనివార్య కారణాల వల్ల లోకాయుక్తలో ఆరోజు అందుబాటులో లేకపోతే వారు విధిగా ఇతర కార్యాలయాలు, సంస్థలు, పాఠశాలల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఆవిధంగా పాల్గొన్నట్లు ఒక ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ తెలిపారు.

హంద్రీ-నీవా కాలువకు మల్లెంపల్లి సమీపంలో పడిన గండి (ఫైల్)



మెఘా నిర్లక్ష్యం..!

కర్నూలు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):

హంద్రీనీవా ప్రధాన కాలువ నిర్వహణ బాధ్యత మెఘా ఇంజనీరింగ్ కంపెనీదే. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం, నిర్వహణపై ఆ సంస్థ అంతులేని అలసత్వం ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. కాలువ గట్లు బలహీనంగా మారాయి. కాలువ విస్తరణ పనులకు రూ.6,182 కోట్లతో గత వైసీపీ పభుత్వం టెండర్లు పిలిస్తే ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ బిల్లులు రావనే భయంతో రీ సర్వే పేరిట రెండున్నరేళ్లు గడిపేశాయి. కాలువ గట్లు బలహీనంగా మారుతున్నాయి. మరమ్మతులకు నిధులు ఇవ్వబోమని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపితే విస్తరణ బూచి చూపి గత వైసీపీ ప్రభుత్వం పైసా ఇవ్వలేదు. ఫలితంగా మల్లెంపల్లి వద్ద గండి పడింది. రెండు మూడు రోజుల్లో గండి పూడ్చినా 1,500 క్యూసెక్కులు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కాలువ గట్టుపై ముళ్ల పొదలు కూడా తొలగించలేని (జంగిల్ క్లియరెన్స్) దైన్య పరిస్థితి. కాలువ విస్తరణ దేవుడెరుగు.. మరమ్మతులు, అసంపూర్తి పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

రాయలసీమ జిల్లాల జీవనాడి హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం. కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు అందించే ప్రధాన కాలువ పలు చోట్ల ప్రమాదకరంగా మారింది. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మాల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కి.మీ. ప్రధాన కాలువ, ఎనిమిది లిఫ్టులు నిర్మించారు. కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులు కాగా.. 1,500 క్యూసెక్కులు కూడా తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. గత సోమవారం వెల్దుర్తి మండలం మల్లెంపల్లి సమీపంలో కాలువకు భారీగా గండి పడడం.. నిర్వహణ సంస్థ మెఘా కంపెనీ నిర్లక్ష్యమే ఇందుకు ప్రధాన కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా హంద్రీ నీవా కాలువ ద్వారా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఏ నెలలో ఏ రిజర్వాయరు నింపాలని ఇటీవల జరిగిన ప్రాజెక్టుల సమీక్షలో సీఎం చంద్రబాబు ఇంజనీర్లకు లక్ష్యాలను నిర్దేశించారు. మల్లెంపల్లి గండిని తాత్కాలికంగా మరమ్మతులు చేసి ఇసుక బస్తాలు వేసినా.. పూర్తి స్థాయిలో సామర్థ్యంలో నీటిని పంపింగ్ చేయలేని పరిస్థితి ఉందని ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.

హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ఫేజ్-1 కింద 216.30 కి.మీ. ప్రధాన కాలువ, ఎనిమిది ఎత్తిపోతల పథకాలు (లిఫ్టులు) నిర్మాణ పనులు మెఘా ఇంజనీరింగ్ సంస్థ చేపట్టింది. రాష్ట్ర విభజన తరువాత 2014-15 నుంచి శ్రీశైలం జలాశయంలో నీటి లభ్యతకు అనుగుణంగా పూర్తిస్థాయిలో వరద జలాలు ఎత్తిపోస్తున్నారు. ఏటా కనిష్ఠంగా 16.81 టీఎంసీలు, గరిష్ఠంగా 47.38 టీఎంసీలు ఎత్తిపోశారు. ఒప్పందం ప్రకారం కాలువ, పంపింగ్ స్టేషన్ల నిర్వహణ బాధ్యతలు కాంట్రాక్ట్ సంస్థదే. పంపింగ్ స్టేషన్ల నిర్వహణ తప్పా ప్రధాన కాలువ నిర్వహణపై ఆ సంస్థ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. నందికొట్కూరు, కృష్ణగిరి, పత్తికొండ, మద్దికెర ప్రాంతాల్లో ప్రధాన కాలువ గట్టుపై నిండిపోయిన ముళ్ల పొదలు పెద్దపెద్ద చెట్లుగా మారాయి. వాటి వేర్లు కాల్వ గట్టు మట్టి లోపలికి వెళ్లడంతో మట్టి లూజుగా మారడం.

బలహీనంగా మారిన కాలువ గట్లు

ఎలుకలు, ఉడుములు రంధ్రాలు చేయడం.. వెరసి నీళ్ల విడుదల చేసినప్పుడు గండి గట్టు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. ఏళ్ల గడిచినా జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు కూడా చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాలువకు నీటిని విడుదల చేయడానికి నెల రోజుల ముందే క్షేత్ర స్థాయిలో పరిశీలించి జంగిల్ క్లియరెన్స్, గట్లు బలహీనంగా ఉన్న చోట్ల మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం వల్లే మల్లెంపల్లి వద్ద గండి పడిందనే ఆరోపణలు లేకపోలేదు. 17.2 కిలోమీటర్ల వద్ద ఉన్న యూటీ దగ్గర గట్టు బలహీనంగా మారి గండి పడే ప్రమాదం ఉండడంతో ముందే గుర్తించిన ఇంజనీర్లు సొంత డబ్బుతో మరమ్మతులు చేయించారు. ఇలాంటి ప్రమాదకర ప్రదేశాలు పలు చోట్ల ఉన్నాయని, తక్షణం మరమ్మతులు చేయాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విస్తరణ పేరిట అలసత్వం

హంద్రీ-నీవా కాలువను 6,500 క్యూసెక్కులకు విస్తరిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద అప్రోచ్ కెనాల్ సహా 0/0 కి.మీ. నుంచి 216.300 కి.మీ. వరకు ప్రధాన కాలువ విస్తరణ, అదనపు 8 పంపింగ్ స్టేషన్ల నిర్మాణం పనులు రూ.6,182.19 కోట్లకు 2021 సెప్టంబరు 15న అప్పటి ప్రభుత్వం సాంకేతిక అనుమతులు ఇచ్చింది. రెండు ప్యాకేజీలుగా టెండర్లు పిలిస్తే.. ప్యాకేజీ-1 మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్షర్ లిమిటెడ్ కంపెనీ, ప్యాకేజీ-2 హైదరాబాదుకు చెందిన డీఎస్ఆర్-వీపీఆర్ జాయింట్ వెంచర్ దక్కించుకున్నారు. 2021 డిసెంబరు 31న అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. ఒప్పంద గడువు 36 నెలలు కాగా.. ఇప్పటికే 32 గడిచిపోయాయి. ఒప్పందం చేసుకున్నా.. గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వదనే భయంతో పనులు చేపట్టలేదనే ఆరోపణలు ఉన్నాయి. మరమ్మతులైనా చేద్దామని సుమారు రూ.50 లక్షలతో ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపితే.. విస్తరణ పనులు చేయడాకి కాంట్రాక్ట్ సంస్థ ఒప్పందం చేసుకుంది.. ఈ సమయంలో మరమ్మతులు ఎలా చేపడుతారు..? అంటూ ఈఎన్సీ ఆఫీసు నుంచి వెనక్కి పంపారు. విస్తరణ పనులు చేయక.. మరమ్మతులు లేక కరువు సీమకు జీవనాడి అయినా హంద్రీ-నీవా అనాథగా మారిందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అంతేకాదు.. రాష్ట్ర విభజన తరువాత రూ.1,050 కోట్లతో ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం విస్తరణ పనులు చేపట్టింది. కడప జిల్లాకు చెందిన అప్పటి టీడీపీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ సంస్థ పనులు చేపట్టింది. రూ.285.77 కోట్లు ఖర్చు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అవినీతి పేరుతో ఆ పనులు ఆపేసింది. దీంతో స్ట్రక్చర్స్ వద్ద ఎగువ, దిగువన 50 మీటర్ల వరకు చేపట్టాల్సిన ప్రొటెక్షన్ పనులు ఆగిపోయాయి. ఆ ప్రాంతాల్లో కాలువకు ప్రమాదం పొంచి ఉందనే ఇంజనీర్లే అంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా రాయలసీమ కరువు పల్లెలకు జీవనాడి అయిన హంద్రీ-నీవా కాలువ భద్రత ప్రశ్నార్థకంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. సీఎం చంద్రబాబు ప్రభుత్వమైనా తక్షణం మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పనులైనా చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

- హంద్రీ-నీవా కాలువ నిర్వహణపై అలసత్వం
- రూ.6,182.19 కోట్లతో కాలువ విస్తరణ పనులు
- రెండున్నరేళ్ల క్రితమే ఒప్పందం చేసుకున్న కాంట్రాక్ట్ సంస్థ
- మరమ్మతులకు నిధులు ఇవ్వని గత వైసీపీ ప్రభుత్వం
- పలుచోట్ల బలహీనంగా కాలువ గట్లు
- ఆందోళనలో కరువు రైతులు

గండి పూడ్చివేత పనులు పూర్తి చేశాం

వెల్దుర్తి మండలం మల్లెంపల్లి సమీపంలో హంద్రీ-నీవా కాలువకు పడిన గండిని పూడ్చి వేత పనులు పూర్తి చేశాం. కాలువ నిర్వహణ బాధ్యతలు మెఘా ఇంజనీరింగ్ కంపెనీ చేయాల్సి ఉంది. నిర్వహణ గడువు ఇంకా ఉంది. కాలువ గట్టుపై పలు చోట్లు ముళ్లపొదలు ఉన్నమాట నిజమే. వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా సుమారు రూ.1,400 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నాం.

- రాంగోపాల్, హంద్రీ-నీవా ప్రాజెక్టు ఎస్ఈ, కర్నూలు



గండిని పూడ్చి ఇసుక బస్తాలు వేసిన దృశ్యం



పత్తికొండ సమీపంలో కాలువ గట్టుపై నిండిపోయిన ముళ్లపొదలు

వ్యవసాయం కార్పొరేట్‌కు ధారాదత్తం

రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య



నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 9: కేంద్రంలో పాలన సాగిస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య అన్నారు. ఆలిండియా కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల సంయుక్త పిలుపులో భాగంగా శుక్రవారం పత్తికొండలో ఆర్డీవో కార్యాలయం ఎదుట, రైతు, ఏఐటీయూసీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ అంటూ నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వి నతి పత్రం ఇచ్చారు. రామచంద్రయ్య మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం మీద 70 శాతం పైబడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. అలాంటి వ్యవసాయ రంగాన్ని పరిరక్షించాల్సిన పాలకులు కేంద్ర బడ్జెట్‌లో 18 శాతం నుంచి 13 శాతానికి నిధులు కుదించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వ్యవసాయ రంగాన్ని సంపన్నులకు ధారాదత్తం చేసేందుకు కుయుక్తులు పనుతున్నారని విమ ర్శించారు. కార్పొరేట్ శక్తులను తరిమికొట్టేందుకు రైతులు పోరాటాలకు స న్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రా జాసాహెబ్, నాయకులు కారెన్న, గురుదాస్, ఏఐటీయూసీ నాయకులు రంగ న్న, నెట్టికంటయ్య, రైతు సంఘం నాయకులు సిద్దు, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠం ప్రాంగణంలో ముత్యాల ముగ్గులు



శ్రీమఠం ప్రాంగణంలో రంగులతో వేసిన ముగ్గులు

మంత్రాలయం, ఆగస్టు 9: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో అందంగా రంగులతో ముగ్గులు వేస్తున్నారు. రాఘవేంద్ర స్వామి 353వ ఆరాధనోత్సవాలు దగ్గర పడుతుండటంతో యేల్కూరు కుటుంబ సభ్యులు శశికాంత్, వెంకటేశ్ శెట్టి, ఫణిరాజ్‌శెట్టి, పాండురంగయ్య శెట్టి, లక్ష్మయ్య, ప్రవీణ్‌లు గత 12 ఏళ్ల నుంచి సొంత ఖర్చులతో రంగులు వేయిస్తున్నారు. మఠం ప్రాంగణంలోని నలువైపులా వివిధ రంగులతో 16 రకాల ముగ్గులు వేశారు. గత 15 రోజుల నుంచి సుందరంగా భక్తులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దుతున్నారు. రాత్రి, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల సమయంలో భక్తులు లేని సమయాల్లో భారీ కేడ్లను చుట్టు పెట్టుకుని రంగులతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. యేల్కూరు కుటుంబ సభ్యులకు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అభినందించి ఫలపుష్ప శేషవస్త్రం మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 9: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ అధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ కార్డు కలిగిన నిరుద్యోగ యువకులకు మెన్స్ టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పకుమార్ శుక్రవారం ఒక ప్రకనటలో తెలిపారు. 30 రోజుల పాటు శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు ఉండి చదవడం, రాయడం వచ్చిన అభ్యర్థులు ఆధార్,రేషన్, విద్యార్హత, బ్యాంక్‌పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో పాటు ఆరు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో కల్లూరు తహసీల్దారు కార్యాలయం పక్కనే ఉన్న సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 90007 10508ను సంప్రదించాలన్నారు.

రేపు అగ్రికల్చర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 9: ఉమ్మడి కర్నూలు జిల్లా అగ్రికల్చర్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్‌కు ఎన్నికలు ఈ నెల 11న నిర్వహిస్తామని రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సాయికుమార్ తెలిపారు. ఈ ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల అధికారిగా ప్రకాశం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారిగా కృష్ణా జిల్లా అధ్యక్షుడు పెన్నా రమేష్‌ను నియమించామని కలెక్టరేట్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు పరిశీలకునిగా రాష్ట్ర అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌ను నియమించామన్నారు. ఈ ఎన్నికల్లో అసోసియేషన్, మినిస్టీరియల్, క్లాస్ ఫోర్ సిబ్బంది అందరూ పాల్గొని తమ సమస్యలను ఎవరైతే పరిష్కరించేందుకు ముందడుగు వేస్తారో అటువంటి నాయకులను ఎన్నుకుని సంఘాన్ని బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సాయికుమార్ తెలిపారు.

వైసీపీ కార్యకర్త కుటుంబానికి మాజీ సీఎం జగన్ పరామర్శ

నంద్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి)/మహానంది: మహానంది మండలం సీతారామాపురంలో ఇటీవల హత్యకు గురైన పసుపులేటి సుబ్బరాయుడు కుటుంబాన్ని మాజీ సీఎం జగన్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు కుటుంబ సభ్యులతో జరిగిన ఉదంతంపై ఆరా తీశారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తమ కుటుంబానికి ఇప్పటికి ప్రాణహాని ఉందని జగన్‌కు తెలుపగా, వారికి రక్షణ కల్పిస్తామని చెప్పారు. తమ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని కోరగా చూద్దామంటూ జగన్ మాట దాటవేశారు. వారిని పరామర్శించిన తర్వాత విలేకరులతో మాట్లాడుతూ ఈ హత్య వెనుక టీడీపీ ప్రజా ప్రతినిధుల హస్తం ఉందని ఆరోపించారు. న్యాయస్థానంలో బాధితుల పక్షాన పోరాడతానని, గ్రామాల్లో ప్రజలు స్వేచ్ఛగా ఉండేందుకు పోలీసులు రక్షణ కల్పించేలా న్యాయస్థానాల నుంచి ఆదేశాల తీసుకువచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణి రెడ్డి, కాటసాని రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.



సుబ్బారాయుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైసీపీ ఎమ్మెల్యే, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

శ్రీశైలంలో కృష్ణమ్మ పరవళ్లు

శ్రీశైలం, ఆగస్టు 9: శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. గత నెల జూలైలో ప్రారంభమైన వరద ప్రవాహంతో క్రమంగా జలాశయం నిండుకుంది. జూలై 29 తేదీన జలాశయం మూడు క్రస్టు గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతుండడంతో శుక్రవారం డ్యామ్ అధికారులు జలాశయం 10 క్రస్టుగేట్లును 14 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 2,89,265 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 40,311 క్యూసెక్కులు మొత్తం 3,29,576 వరద ప్రవాహం వస్తోంది. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 3,92,415 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 883 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 204.3520 టీఎంసీలుగా ఉంది.



35 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు

జిల్లాలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్

నంద్యాల క్రైం, ఆగస్టు 9 : ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నేర నివారణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు నిర్వహించినట్లు జిల్లా పోలీస్ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ మేరకు మట్కా, జూదం, ఇసుక అక్రమ రవాణా, డ్రంకెన్‌డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణకు మోటార్ వెహికల్ ఆక్ట్‌ను కట్టుదిట్టంగా అమలు పరచడం తదితర వాటిని నిర్వహించినట్లు వెల్లడించాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో భాగంగా డ్రంకెన్‌డ్రైవ్‌లో భాగంగా రెండు కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఘటనల్లో 35మందిపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే మోటార్ వెహికల్ యాక్ట్ అమలు చేస్తూ 137 కేసులు నమోదు చేసి రూ.60,225 జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు. పాణ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొనిదేడు గ్రామం ఊరి బయట పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై అశోక్ తన సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకొని జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.30,390 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో సెబ్, సివిల్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో అక్రమంగా మద్యం అమ్మే నలుగురిపై కేసు నమోదు చేసి 18.61 లీటర్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. నాటుసారా బట్టీలపై దాడులు చేసి సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రెండు వాహనాలను సీజ్ చేసి 31 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.38 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం ఆగస్టు 9: మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో శ్రావణ మాసపు ఉత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో కొనసాగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కింపు కొనసాగగా నగదు రూపంలో రూ.38,70,013 వెండి 6.6కిలోలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవాల అధికారి పాండురంగారెడ్డి, హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేష్, ఏపీజీబీ సిబ్బంది, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానపు సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల, ఆగస్టు 9: మండల పరిధిలోని హెచ్ కైరవాడి సమీపంలో ఉన్న ఎల్లెల్సీ దగ్గర చిన్నమరివీడు గ్రామానికి చెందిన మిన్నల్ల(50) అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మిన్నల్ల గ్రామంలో హోటల్ నడుపుతూ జీవనం సాగించేవాడు. కొన్నేళ్లుగా మిన్నల్ల మానసిక వ్యాధితో బాధపడేవాడు. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. తన రోగం నాయం కాకపోవడం ఇట్లో వాళ్ల పడుతున్న ఆర్థిక ఇబ్బందులను తలుచుకునే బాధ పడేవాడు. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మధ్యాహ్నం ఎల్లెల్సీ దగ్గరకు బైక్‌పై వచ్చాడు. కాలువ గట్టుపై బైక్‌పై నిలిపి అక్కడ ఉన్న ముళ్ల పొదల్లోకి వెళ్లి మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పరసర పొలాల దగ్గర ఉన్న రైతులు బైక్‌ను చూసి అక్కడికి వెళ్లారు. అక్కడ ముళ్ల పొదలో మృతి చెందిన వ్యక్తిని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. చిన్నమరివీడు గ్రామానికి చె ందిన మిన్నల్లగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఆశమ్మ, బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. తెలిపారు.

ఎంపీడీవోలు రిలీవ్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 9: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఎంపీడీవోలను తిరిగి గతంలో పని చేసిన ప్రాంతాలకే పంపాలని పీఆర్‌అండ్‌ఆర్‌డీ డైరెక్టర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న ఎంపీడీవోలను అదే జిల్లాలకు రిలీవ్ చేస్తూ జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈ ఏడాది జనవరి 30న ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు 33 మంది, కడపకు ఏడుగురు మొత్తం 40 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో అనంతపురం జిల్లా నుంచి 23 మంది, కడప నుంచి 16 మంది మొత్తం 39 మందిని కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఎన్నికల విధులు నిర్వహణకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు.

అడవి పంది దాడిలో మహిళకు గాయాలు

చాగలమర్రి, ఆగస్టు 9: మండలంలోని చింతలచెరువు గ్రామంలో శుక్రవారం అడవి పంది దాడిలో ప్రమీల అనే మహిళ గాయపడింది. పొలంలో వరి నాట్లు వేస్తుండగా అడవి పంది దాడి చేయడంతో గాయపడింది. తనతోపాటు వరి నాట్లు వేస్తున్న మహిళలు కేకలు వేయడంతో అడవి పంది పారిపోయింది. గాయపడిన ప్రమీలను చికిత్స నిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. అడవి పందుల బారీ నుంచి అటవీశాఖ వారు కాపాడాలని రైతులు కోరుతున్నారు.

కలెక్టరేట్ ఏవోకు శుభాకాంక్షలు



ఏవో రాజేశ్వరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 9: కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్వరిని ఏపీ వీఆర్వో గ్రేడ్-2 అసోసియేషన్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రేడ్-2 వీఆర్ లకు ప్రొబేషన్ డిక్లరేషన్, పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్ర మంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు రమణ, కోశాధికారి కుమారి యాదవ్, సోమన్న, ఖాజాబాషా, మద్దిలేటి పాల్గొన్నారు.

ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి: డీటీఎఫ్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 9: వర్క్ అడ్జెస్ట్‌మెంటు కోసం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని డీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీజీ వెంకట్రాముడు, ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ, పత్రికా ప్రధాన సంపాదకులు రత్నం యేసేపు మాట్లాడుతూ పనిసర్దుబాటు పేరుతో ఏ ఒక్క పాఠశాల మూతపడకూడదన్నారు. సింగల్ మీడియం విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 117ను దాని అనుబంధ జీవోలను రద్దు చేయాలని, 1 నుంచి 5 తరగతుల ప్రాథమిక విద్యావ్యవస్థను కొనసాగించాలని కోరారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

ఓర్వకల్లు, ఆగస్టు 9: పరిశ్రమల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్, రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్‌లు శుక్రవారం ఓర్వకల్లు పర్యటనకు వచ్చిన మంత్రి టీజీ భరత్‌కు ఉక్కు పరిశ్రమలో వినతి పత్రం సమర్పించారు. ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని, తక్షణమే పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అఖిల్, వలి, సుమన్, చిన్న సుంకన్న, మహ్మద్‌మియా పాల్గొన్నారు.

సర్పంచులు శిక్షణను వినియోగించుకోండి

ఓర్వకల్లు, ఆగస్టు 9: మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో మల్లేశ్వరి శుక్రవారం అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజులపాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. పంచాయతీలో నిర్వహించే పారిశుధ్య కార్యక్రమాలు, నిధులను ఎలా ఖర్చు చేయాలనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. మండలంలోని 22 పంచాయతీలకు చెందిన సర్పంచులు శిక్షణకు హాజరు కావాలని కోరారు.

రైతుల సంక్షేమమే టీడీపీ ధ్యేయం: ఎమ్మెల్యే



ఎత్తిపోతల పథకం మోటార్ల స్విచ్ ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్, ఆగస్టు 9: రైతుల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం మండలంలోని సంగాల గ్రామంలో తుంగభద్రనది పక్కన ఉన్న పంపుహౌస్‌లోని ఎత్తిపోతల పథకం మోటార్ల స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ ప్రతి రైతు సాగునీటిని దుర్వినియోగం చేయకుండా పంటలకు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ అధికారులు నాగార్జున, టీడీపీ నాయకుడు, మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, ముస్లిం మైనార్టీ నాయకుడు దూద్‌వలి, ధనుజయుడు, అమర్, బాలాజీవెంకటేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఆగస్టు 9: నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా శనివారం నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈలు రాజేంద్ర బాబు, నాగప్ర సాద్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పవర్‌హౌస్, సెంట్రల్ సెక్షన్, బళ్లారిరోడ్, సంతోష్‌నగర్, బి.క్యాంప్, ఓల్డ్‌టౌన్, ఇండస్ట్రీయల్ ఏస్టేట్ సెక్షన్‌లోని ప్రాంతాల్లో కరెంట్ కోత ఉంటుందన్నారు. అదేవిధంగా కల్లూరు, కర్నూలు రూరల్, ఓర్వకల్లు మండలాల్లోని అన్ని సబ్ స్టేషన్లలో కరెంట్ కోత ఉంటుందని రూరల్ ఏడీఈ సుబ్బన్న తెలిపారు. ఈ మేరకు ఎస్టేట్, చిన్నటేకూరు, పంచలింగాల, నన్నూరు, ఓర్వకల్లు మండలాల్లోని 33-11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు.

విద్యా రంగానికి పెద్దపీట

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 9: కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని జనసేన పార్టీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జి అర్షద్ తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌లుగా ఎన్నికైన జనసేన పార్టీ సానుభూతిపరులను సన్మానించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించారని, కూటమి ఈ వ్యవస్థను గాడిలో పెట్టడంతోపాటు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణి, షఫీ, కృపారాణి, రాజేశ్వరి, జయన్న పాల్గొన్నారు.

క్రీడా సంఘాల సంబరాలు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 9: ప్యారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ రజత పతకం సాధించడంపై జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, హాకీ అసోసియేషన్ నేతృత్వంలో మిఠాయిలు పంపిణీ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం డీఎస్‌ఏ స్టేడియంలోని మేజర్ ధ్యాన్‌చంద్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రామాంజనేయులు, శ్రీధర్ రెడ్డి, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సాయి ఉదయ్

గూడూరు ఆగస్టు 9: గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్ అన్నారు. శనివారం గూడూరులో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి ఉదయ్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు మోహన్, జిల్లా కమిటీ సభ్యుడు అబ్బు, గూడూరు మండల నాయకులు ఆచారి, ఖాజా మాట్లాడుతూ గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాల చుట్టూ రక్షణ గోడ లేదని, తాగునీటి సౌకర్యం లేదని అన్నారు. బాత్రూంలు సరిగ్గా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ గూడూరు మండల నాయకులు ఇమ్రాన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

మంత్రి టీజీ భరత్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 9: కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం 51వ వార్డు ఈసీఎం కాంపౌండులో రూ.50లక్షలతో సీసీ డ్రైవ్ నిర్మాణానికి మంత్రితోపాటు నగర మేయర్ బీవై రామయ్య, కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇంటింటికి తిరిగినప్పుడు ప్రజల నుంచి అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. వాటన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈ షాకీర్, డీఈ గిరిరాజు, నరేష్, ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడద్ది, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సెక్రటరీ నాగరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించండి: ప్రజలు తెలుపుతున్న సమస్యలు త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. శుక్రవారం మన కర్నూలు- నా బాధ్యత కార్యక్రమంలో భాగంగా 15వ వార్డు బుధవారపేటలో నగర పాలక అధికారులతో కలిసి మంత్రి విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బుధవారపేటలో హంద్రీనదీ ఒడ్డున రక్షణ వలయం, మోడ్రన్ టాయిలెట్లు, పైపులైన్, సీసీ డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని



పూడిచెర్లలో ధ్వంసం చేసిన పైలాన్‌ను
పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత



కర్నూలులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

స్థానికులు కోరగా.. వెంటనే వాటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ జనార్దన్, సెక్రటరీ నాగరాజు, కార్పొరేటర్లు శివమ్మ, పరమేష్ పాల్గొన్నారు.

పైలాన్‌ను ధ్వంసం చేయడం దుర్మార్గం

ఓర్వకల్లు: అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమల స్థాపన కోసం పూడిచెర్ల జాతీయ రహదారి పక్కనే పైలాన్‌ను ప్రారంభించారు. గత వైసీపీ పాలనలో వైసీపీ గూండాలు ధ్వంసం చేయడం దుర్మార్గమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పూడిచెర్ల జాతీయ రహదారి పక్కనే ఉన్న ధ్వంసమైన పైలాన్‌ను వారు పరిశీలించారు. 2014 టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన పైలాన్‌ను నాటి సీఎం చంద్రబాబు ప్రారంభించారన్నారు. ధ్వంసమైన పైలాన్‌ను త్వరితగతిన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, ఖాజామియా, లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, మహబూబ్ బాషా, అన్వర్, తిప్పాయపల్లె సుధాకర్ రెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పరపతి సంఘాల కంప్యూటీకరణపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్వో, అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 9: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటీకరణ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సహకార శాఖ కమిషనర్‌తోపాటు రిజిస్ట్రార్ ఎ.బాబు సమీక్షించారు. ఈకాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి జేసీ, డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు, బ్యాంకు సీఈవో విజయకుమార్, జీఎం రామాంజనేయులు, జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి శిరీష పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా మెడికల్ సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్ ఇస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 9: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ స్కీం మెడికల్ సర్టిఫికెట్‌ను శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి పంపిణీ చేశారు. కండరాల క్షీణత, పెరాలసిస్‌తో బాధపడుతున్న ఆలూరుకు చెందిన విజయకుమార్‌కు మెడి కల్ సర్టిఫికెట్‌ను ఆయన బంధువుకు అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ మెడికల్ సర్టిఫికెట్లకు సంబంధించి ఆసుపత్రిలో ప్రతి బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తు పేర్లు నమోదు చేసుకున్న వారిని వైద్యనిపుణుల బృందం పరీక్షించి సర్టిఫికెట్ అందజేస్తారని తెలిపారు. మెడికల్ సర్టిఫికెట్ కావాల్సిన వారు ముందుగానే వచ్చి సీనియర్ అసిస్టెంట్ జమాల్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని, దరఖాస్తుతోపాటు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, ఫోన్ నెంబరు ఇవ్వాలన్నారు.

ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ
కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కల్లూరు, ఆగస్టు 9: ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన కల్లూరు మండలం ఓబులాపురం తండా, కొల్లపల్లి తండాల్లో గిరిజనులతో సమావేశమయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎల్.భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బి.లీలా వెంటక శేషాద్రి మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన యువతకు, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం వైద్యులు ఆదివాసీలకు మలేరియా, డెంగీ, రక్తహీనత, సుగర్ టెస్ట్, స్కానింగ్ టెస్టులను నిర్వహించి లోపాలు ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉలిందకొండ మెడికల్ ఆఫీసర్ రఘు, ఆనంద్, టీడీపీ నాయకుడు రంగస్వామిరెడ్డి, సర్పంచు సుంకులమ్మ, సెక్రటరీ నాగేశ్వరరావు, గ్రామ టీడీపీ నాయకులు హీరునాయక్, శంకర్‌నాయక్, రవినాయక్, గోపీనాయక్, దీపనాయక్, శ్రీకాంత్, విక్రమ్, షేక్షావలి, సి.వెంకటరమణ, హనుమన్న, కరీం తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటా: బైరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 9: మత్స్యకారులను ఆదుకుంటామని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని జిల్లా మత్స్య సహకార సంఘం కార్యాలయాన్ని బైరెడ్డి ప్రారంభించారు. సంఘం జిల్లా చైర్మన్ నవీన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులకు ఎన్నో పథకాలు, కార్యక్రమాలను అమలు చేశాయని అన్నారు. అర్హులైన మత్స్యకారులందరికీ పథకాలు, కార్యక్రమాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు తాను పని చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు శ్రీనివాసులు, వైస్ చైర్మన్ పెద్ద వీరేష్, డైరెక్టర్లు శేఖర్, భాస్కర్, మల్లీశ్వరుడు, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, నగేష్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కర్నూలు, ఆగస్టు 9: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గడియారం ఆసుపత్రి సమీపంలో వర్మ కాంపౌండులో జరిగిన శివ హత్య కేసులో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. నిందితులు షేక్ రఫీక్, తెలుగు బ్రహ్మం, భరత్, పింజరి ముర్తుజావలిలను అరెస్టు చేసి డీఎస్పీ ఎదుట హాజరు పరిచారు. డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ పవన్ కుమార్‌లు శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. తాండ్రపాడుకు చెందిన వర్మ కాంపౌండులో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. రఫీక్ భార్యతో వివాహేతర సంబంధం నడిపిస్తున్నాడు. ఈ నేపథ్యంలో రఫిక్ తన స్నేహితులతో కలిసి శివను హత్య చేశాడు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెల్లడించారు.

కిడ్నాప్ కేసులో..

కర్నూలు, ఆగస్టు 9: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రవీణ్ కుశాల్ కిడ్నాప్ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నిందితులు పెద్ద మద్దిలేటి (పర్ల), అనిల్ కుమార్ (బుధవారపేట), సురేష్ (ముజఫర్ నగర్), గూడూరు భాస్కర్ రెడ్డి (బేతంచెర్ల), తేజలను అరెస్టు చేసినట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన ఫార్చునర్ కారు, ఇన్నోవా కారులను సీజ్ చేశామని చెప్పారు. మద్దిలేటికి ప్రవీణ్ కుశాల్ వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని రూ.2 కోట్లు వసూలు చేశాడని తెలిపారు. టికెట్ ఇప్పించకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో కుశాల్‌ను కిడ్నాప్ చేశాని చెప్పారు. నగరంలో పలు చోట్ల తిప్పుతూ అతన్ని విచక్షణారహితంగా కొట్టారని, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా శ్రీనివాసాచారి



కర్నూలు, ఆగస్టు 9: మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా శ్రీనివాసాచారి శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసాచారి తిరుమల లా అండ్ ఆర్డర్ డీఎస్పీగా పని చేస్తూ ఇటీవల కర్నూలు బదిలీ అయ్యారు. ప్రస్తుతం డీఎస్పీగా ఉన్న బాబు ప్రసాద్ కర్నూలు డీఎస్పీగా బదిలీ అయిన విషయం తెలిసిందే.

అక్రమ రవాణాపై చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 9: ఆటవీశాఖ పరిధిలోని కర్రలు, దుంగలు, వన్యప్రాణులను అక్రమంగా తరలించిన బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని ఫ్లయింగ్ స్క్వాడ్ డివిజన్ ఫారెస్టు అధికారి సూర్య చంద్రరాజు అన్నారు. శుక్రవారం ఉదయం అక్రమంగా వెదురు కర్రలను తరలిస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా దాదాపు 80 వేల విలువ చేసే సరుకు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు సరకు స్వాధీనం చేసుకుని, వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సూర్యచంద్రరాజు మాట్లాడుతూ అనుమతులకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించిన బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫారెస్టు రేంజర్ ప్రసాద్, మధు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 9: విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శిలాఫలంపై దాడి చేయడాన్ని ఖండిస్తూ వైసీపీ నాయకులు నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీ మధుసూదన్, కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ ఇంతియాజ్‌లు పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి: చెన్నమ్మ కూడలిలో సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

కార్పొరేట్ వ్యవస్థను తరిమికొట్టాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 9: దేశ సంపదను దోచుకుంటున్న కార్పొరేట్ వ్యవస్థను దేశం నుంచి తరిమికొట్టాలని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో శుక్రవారం కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ కార్యక్రమం ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సుంకన్న హాజరయ్యారు. జగన్నాథం మాట్లాడుతూ ప్రధాని మోదీ విధానాల వల్ల దేశ సంపదను రిలియన్స్ ఆదాని, అంబానీలు దోచుకుంటున్నారని అన్నారు. రైతాంగ ఉద్యమంలో చనిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని మాట తప్పారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి, రైతులు పండించే పంటలకు ఎరువులు విత్తనాలకు సబ్సిడీ లు తగ్గించి కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, రాధాక్రిష్ణ, రాముడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

వ్యవసాయ రంగాన్ని కాపాడండి

ఓర్వకల్లు: ప్రభుత్వ రంగ సంస్థలను, వ్యవసాయ రంగాన్ని కాపాడి కార్పొరేట్ శక్తులను తరిమికొట్టాలని సీఐటీయూ జిల్లా నాయకులు ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో షాజహాన్, మల్లేష్, మాసూంబాషా, దస్తగిరి, తిరుపతయ్య, ఎర్రమల, బషీర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు



ఓర్వకల్లులో..

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గూడూరు: కార్మికుల నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ డిమాండ్ చేశారు. శనివారం గూడూరు బస్టాండ్ ప్రాంతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. జె మోహన్ మాట్లాడుతూ మాట్లాడుతూ కార్మికులు ప్రాణ త్యాగాలు చేసి సాధించకున్న 44 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి కేవలం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, మునెప్ప, సోమలింగడు, మద్దిలేటి, మధు, మోహన్, సురేష్ పాల్గొన్నారు.

మానసిక వికాసానికి పెద్దపీట వేయాలి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 9: విద్యార్థుల మానసిక వికాసానికి పెద్దపీట వేయాలని ఆర్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ అన్నారు. శుక్రవారం వీసీ కాన్ఫరెన్స్ హాలులో, వీసీ అధ్యక్షతన యూనివర్శిటీ స్పోర్ట్స్ అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఇందులో వచ్చే విద్యా సంవత్సరం వర్శిటీ పరిధిలో చేపట్టాల్సిన క్రీడా కార్యక్రమాల గురించి కమిటీ సభ్యులతో ఆయన విస్తృతంగా చర్చించారు. రాబోయే 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్పోర్ట్స్ క్యాలెండరు, నిర్వహించాల్సిన క్రీడా పోటీలు, వేదికల గురించి చర్చించారు. వివిధ స్థాయిల్లో జరిగే పోటీల్లో వర్శిటీ తరపున పాల్గొనే విద్యార్థులకు ఒకే రకం యూనిఫారం ధరించే విధంగా చూడాలని కళాశాలల యాజమాన్యాలకు వీసీ సూచించారు. కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ శివ కిషోర్, ప్రభుత్వ బీఎడ్ కళాశాల పీడీ డాక్టర్ కేవీ కల్యాణ్‌కుమార్, నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాల పీడీ హేమంత్‌రెడ్డి, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పీడీ డాక్టర్ కంబిరెడ్డి, డాక్టర్ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీబీజీ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 9: చెత్త నుంచి బయోగ్యాస్ తయారు చేసే కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్ (సీబీజీ) ఏర్పాటుకు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, నగర పాలక ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి గార్గేయపురం డంప్ యార్డులో స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈ షాకీర్, డీసీపీ సంధ్య, డీఈఈ నరేష్, ఏఈ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి నుంచి మున్సిపల్ శాఖ సంచాలకులు హరినారాయణ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎంఈలో షాకీర్, శేషసాయి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు. అన్న క్యాంటీన్లు, సీబీజీ ప్లాంట్లకు భూమి, పీపీపీ ప్రాజెక్టులు, ఓ అండ్ ఎం ఆధారిత రోడ్ల నిర్వహణ, డిజిటల్ లావాదేవీలు, పేదరిక నిర్మూలన అంశాలపై చర్చించారు.

అంతర్జాతీయ అథ్లెటిక్ పోటీలకు జిల్లా అథ్లెట్

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 9: స్వీడన్‌లో నిర్వహించే అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెట్స్ పోటీలకు జిల్లా మాస్టర్ అథ్లెట్ ఖాజా బందెనవాజ్ ఎంపికయ్యారు. 60 ఏళ్ల వయస్సు విభాగంలో పూణేలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో 100 మీటర్ల హడిల్స్, 400 మీటర్ల పరుగు పందెం 4/400 మీటర్ల రిలే పరుగులో ప్రతిభ చాటి విజేతలయ్యారు. ఈ నెల 13 నుంచి 25వరకు స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌లో జరిగే అంత ర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు అర్హత సాధించడంపై జిల్లా మాస్టర్స్ సంఘం ప్రతినిధులు పాండు రంగారెడ్డి, రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అభినందనలు తెలిపారు.

రగ్బీ విజేతలు లక్ష్మీపురం, ఆదర్శ పాఠశాలల జట్టు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 9: ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి రగ్బీ అంతర్ పాఠశాలల అండర్-15 బాలబాలికల పోటీల్లో లక్ష్మీపురం ఏపీఎస్ డబ్ల్యూఆర్ పాఠశాల, బాలుర విభాగంలో ఆదర్శ విద్యామందిర్ జట్లు మొదటి స్థానాలు సాధించాయి. ఆదర్శ విద్యాసంస్థల ప్రతినిధి డా.యశస్వి, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేసి అభినందించారు. బాలుర విభాగంలో ఆదర్శ విద్యామందిర్, సి.బెళగల్ ఏపీఎస్ డబ్ల్యూఆర్ పాఠశాల, బెళగల్ రెసిడెన్షియల్ పాఠశాల వరుసగా మొదటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో లక్ష్మీపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్, దిన్నెదేవరపాడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్, కంబలపాడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలల జట్లు మొదటి రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో కొండపోగు చిన్న సుంకన్న, మహబూబ్ సుభాని, గుంటూరు సుమంత్, నాగశ్రీనివాసులు, శ్రీకాంత్, రహిమతుల్లా, సురేంద్ర, రాఘవేంద్ర పాల్గొన్నారు.

క్విట్ ఇండియా నినాదంతోనే దేశానికి స్వాతంత్ర్యం

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 9: క్విట్ ఇండియా నినాదంతోనే మనకు స్వాతంత్ర్యం వచ్చిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. బాబురావు అన్నారు. శుక్రవారం నగరంలోని డీసీసీ కార్యాలయం వద్ద బాబురావుతోపాటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు 83వ క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి, వందనం చేశారు. అంతకు ముందు డీసీసీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి కొండారెడ్డి బురుజు విగ్రహం సమీపంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే పి. మురళీకృష్ణ, ఐఎన్‌టీయూసీ, నాయకులు బతుకన్న, అనంతరత్న మాదిగ, ఎస్ ప్రమీల, రియాజుద్దీన్, సయ్యద్ నవీద్, రామాంజినేయులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయండి

కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 9: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయడంతోపాటూ ఆదోని ప్రభుత్వ వైద్యశాలను త్వరగా పూర్తి చేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. శుక్రవారం ఢిల్లీలోని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి నడ్డా కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలతోపాటు తెలంగాణ, కర్ణాటక జిల్లాల వాసులకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని, ఈ ఆసుపత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేస్తే రోగులకు మెరుగైన వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి రూ.475 కోట్లు కేటాయించినప్పటికీ ఇప్పటి వరకు కేవలం 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని, ఈకళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయించాలని కోరారు.

14లోపు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 9: 2024 జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రతిభ చాటిన క్రీడాకారులు (వివిధ క్రీడాంశా లలో) స్పోర్ట్స్ అవార్డు కోసం ఈనెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకో వాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ 1-4-2023 నుంచి 31-3-2024 మధ్యకాలంలో పతకాలు సాధించిన వారు అర్హులన్నారు. వారి ధ్రువీకరణ క్రీడా పత్రంతో డీఎస్‌ఏ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. వివరాలకు 08518-225419 నెంబరును సంప్రదించాలని సూచించారు.

మదరసాను నూతన కమిటీకి అప్పగింత

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 9: కర్నూలు పాతనగరంలోని అంజుమన్-ఏ-శంషీయ మదరసాను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, వక్ఫ్ బోర్డు అధికారులు నూతన కమిటీకి అప్పగించారు. శుక్రవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సునీల్ కన్నా, ఇన్స్‌పెక్టర్లు అల్తాఫ్ హుసేన్, సయ్యద్ సోహయిల్‌లు మదార్‌సాను సందర్శించారు. మదార్‌సాను నూతన కమిటీ అధ్యక్షుడు మౌలానా షేక్ అబ్దుల్ జబ్బార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీకి అప్పగించారు. ఈ సందర్భంగా సునీల్ కన్నా మాట్లాడుతూ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ ఎల్ అబ్దుల్ ఖాదీర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ మదార్సాను నూతన కమిటీకి అప్పగించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న సెబ్ దాడులు

కోడుమూరు(రూరల్), ఆగస్టు 9: కోడుమూరు సెబ్ సీఐ రామాంజనేయులు అధ్వర్యంలో సిబ్బంది దాడులు కొనసాగుతున్నాయి. నాటుసారా తయారీకి సిద్ధం గా ఉన్న సుమారు 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్బంగా సీఐ మాట్లాడుతూ శుక్రవారం తమకు అందిన సమాచారం మేరకు క్రిష్ణగిరి మండలంలోని ఆలంకొండ శివారు కొండగట్టు ప్రాంతంలో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 4 డ్రమ్ముల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. ఈదాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది అన్సార్ బాషా, వెంకటేష్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

సర్పంచు, సెక్రటరీలకు మూడు రోజుల శిక్షణ

కల్లూరు, ఆగస్టు 9: మండలంలోని సర్పంచులు గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 పంచాయతీ సెక్రటరీలకు 3 రోజుల శిక్షణ కార్యక్రమం ఉం టుందని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈమేరకు ఈనెల 12వ తేదీ నుంచి 14 వరకు కల్లూరు మండ లం పరిషత్ కార్యాలయంలో పంచాయతీల నిర్వహణ, చెత్త సంపద, పొదుపు భాగస్వామ్యం, పారిశుధ్యం, తాగునీరు, పంచాయతీరాజ్ 1994 చట్టంపై శిక్షణ ఇస్తామన్నారు.

'జీవో 117ని రద్దు చేయాలి'

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 9: జీవో నెంబరు 117ని రద్దు చేసి ఉన్నత పాఠశాలలో ఉన్న 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాల ల్లోనే కొనసాగించాలని ఆపస్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి నాగిరెడ్డి, చిన్న స్వామి నాయక్ కోరారు. శుక్రవారం డీఈవో శామ్యూల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఘనంగా శింగరయ్య స్వామి రథోత్సవం

సి.బెళగల్, ఆగస్టు 9: మండలంలోని పోలకల్లు గ్రామంలో శింగరయ్యస్వామి రథోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

మద్దికెర, ఆగస్టు 9: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసే బిందు సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అలివేలమ్మ, ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం చిన్న సన్న కారు రైతుల కోసం సబ్సిడీ కోసం కూడిన డ్రిప్ స్ప్రింకర్లను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పొలానికి సంబంధించిన 1బీ, ఎఫ్ఎండీ, స్కెచ్, చెక్‌బందీ సర్టిఫికేట్లు ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, కరెంటు బిల్లులతో రైతు సేవా కేంద్రాలను ఆశ్రయించాలన్నారు.

కంది, సజ్జ పంటల తొలగింపు

మద్దికెర, ఆగస్టు 9: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామ శివారులో మద్దికెర గ్రామానికి చెందిన లబ్బరుగుండు వెంకటేశ్, లక్ష్మి దంపతులు మూడెకరాల వ్యవసాయ పొలంలో కంది, సజ్జ పంటలు సాగు చేస్తే గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారన్నారు. శుక్రవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అప్పులు చేసి పంటలు సాగు చేస్తే దుండగులు పంటను దున్నేసి నష్టపరిచారని అన్నారు. మాకు ఎం.అగ్రహారానికి చెందిన నాగిరెడ్డి, మద్దికెర గ్రామానికి చెందిన దేవేంద్రపైన అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేస్తామని విలేకరులకు తెలిపారు.

వైసీపీ శ్రేణుల నిరసన

పత్తికొండ టౌన్, ఆగస్టు 9: రాష్ట్రంలో గత ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ పత్తికొండ పట్టణంలో శుక్రవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎంపీపీ నారాయణదాసు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు శ్రీను, మోహన్ క్రిష్ణ, హోతూరు కృష్ణ, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం మారెమ్మ అవ్వ పరువు ఉత్సవాలు

ఆస్పరి, ఆగస్టు 9: వర్షం కోసం ఆస్పరి గ్రామస్తులు శుక్రవారం గ్రామ పొలిమేర చుట్టూ మారెమ్మ పరువు ఉత్సవాన్ని నిర్వహించారు. ఐదు క్వింటాళ్ల అన్నం పెరుగు కలిపిన మిశ్రమ ఆహారాన్ని గ్రామ పొలిమేర చుట్టూ చల్లారు. తప్పుళ్ళతో పెరుగన్నం సమర్పించారు. వరుని దేవుడు కరుణించి వర్షించాలని అన్నదాత ఇంట దిగుబడులు పండాలని పూజించారు.


ఆస్పరి గ్రామ పొలిమేరలో పెరుగన్నం చల్లుతున్న గ్రామస్తులు

ఆర్డీటీ సేవలను సద్వినియోగం చేసుకోండి

మంత్రాలయం, ఆగస్టు 9: గ్రామీణ పేద ప్రజల కోసం ఆర్డీటీ చేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఆర్డీటీ సీఈవో నరసింహులు అన్నారు. శుక్రవారం మండలంలోని రాంపురం గ్రామంలో తదితర గ్రామాలకు చెందిన సీడీసీ వర్క్‌షాపుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌డీటీ పరిధిలో ఉన్న గ్రామాల్లో సంఘంగా ఏర్పడి పిల్లల విద్య కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో గర్జి సురేష్ పాల్‌రాజు, తిమ్మేష్, ఆర్‌డీటీ సంఘాల లీడర్లు ఎర్రన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఈవో నరసింహులు

బీవీని కలిసిన టీడీపీ నాయకులు

నందవరం, ఆగస్టు 9: ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని నందవరం మండల పార్టీ కన్వీనర్ డివి రాముడు, మాజీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పెద్దరాముడులు కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిమ్మరాజు, బూత్ కన్వీనర్ గిడ్డయ్య, బీమశేఖర్, మోహన్, లక్ష్మన్న, చంద్ర, కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.


బీవీ జయనాగేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

తుగ్గలి, ఆగస్టు 9: పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎస్ఎంసీ చైర్మన్ మిద్దె రవికుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం జొన్నగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో నూతనంగా పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌గా ఎన్నికైన మిద్దె రవికుమార్‌ను ప్రధానోపాధ్యాయులు ఉపేంద్ర, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి సన్మానించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్, బాలన్న, సర్పంచ్ ఓబులేసు, వెంకటస్వామి యాదవ్, చంద్రన్న యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యా కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

ఆలూరు, ఆగస్టు 9: పాఠశాలల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్లు కృషి చేయాలని ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్రగౌడ్ సూచించారు. శుక్రవారం ఆలూరు కార్యాలయంలో అన్ని మండలాల్లో గురువారం ఎస్ఎంసీ చైర్మన్‌లుగా ఎన్నికైన వారు వీరభద్రగౌడ్‌ను కలిశారు. ఆయన వారిని సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేత గిరిమల్లేష్ గౌడ్, నాయకులు నరసప్ప, కొమ్ము రామాంజినేయులు, డా. నెట్టప్ప, నారాయణ, రాము యాదవ్, కొమ్ము రాజు, హనుమప్ప, గుల్యం రామాంజినేయులు, ముద్దు రంగ, రమేష్, వెంకటేష్, యింట్ గోవింద్, వన్నూర్ వల్లి, కిట్టు, దద్దు, రాం నాథ్ యాదవ్, రాజ పంపన్న గౌడ్, పాల్గొన్నారు.


చైర్మన్లను సన్మానిస్తున్న వీరభద్రగౌడ్

గోనెగండ్ల: పాఠశాలలకు నూతనంగా ఎన్నికైన విద్యాకమిటీ చైర్మన్‌లు, సభ్యులు ఆయా పాఠశాల అభివృద్ధికి పాటు పడాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కోరారు. శుక్రవారం గోనెగండ్లకు వచ్చిన ఎమ్మెల్యే బీవీకి నూతన విద్యాకమిటీ చైర్మన్‌లు ఘనస్వాగతం పలికారు. బీవీకి శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలు గ్రామాల విద్యాకమిటీ చైర్మన్‌లు, వైస్‌చైర్మన్‌లు, కమీటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బీవీని సన్మానిస్తున్న నూతన విద్యా కమిటీ చైర్మన్‌లు

విద్యా కమిటీ చైర్మన్‌గా గర్జప్ప


వీవర్స్ కాలనీ పాఠశాల విద్యా చైర్మన్‌గా ఎంపికైన గర్జప్ప, హెచ్ఎంలను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, ఆగస్టు 9: ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా బోడబండ గ్రామానికి గర్జప్ప ఎంపికయ్యారు. పాఠశాలలో జరిగిన విద్యాకమిటీ చైర్మన్, ఉప చైర్మన్ ఎన్నికల్లో బోడబండ గ్రామానికి చెందిన గర్జప్పను చైర్మన్‌గాను, బనవాసి గ్రామానికి చెందిన కె.సుజాతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపికైన వారిని టీడీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున, మండల తెలుగు యువత అధ్యక్షులు సురేష్‌చౌదరి, నాగరాజు, రఘు, వెంకటరాముడు, వీరన్న, వీరనాగప్ప, నరసింహులు పూలమాలలు వేసి సన్మానించారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

● గ్రామంలో విస్తృతంగా అవగాహన కల్పించండి
● ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ

ఆదోని, ఆగస్టు 9: బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని తాహసీల్దారులు, ఎంపీడీవోలు, ఐసీడీఎస్ సూపర్వైజరులు, సీడీపీవోలు, ఎంఈవోలు, పోలీస్ అధికారులతో కలిసి బాల్య వివాహాల అరికట్టడంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆదోని డివిజన్ వెనుకబడిన ప్రాంతమైనందున ఇక్కడ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. వీటిని అధిగమించేందుకు ప్రతి అధికారి సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో బాల్యవివాహాలపై గ్రామస్థాయిలో వీఆర్వో, పంచాయతీ సెక్రెటరీ, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఐసీడీఎస్ సూపర్వైజర్, గ్రామసభ ఏర్పాటు చేసుకొని గ్రామంలో తల్లిదండ్రులకు, పిల్లలకు చిన్న వయస్సులో వివాహాలు చేస్తే వారికి జరుగుతున్న ఆరోగ్య, మానసికంగా వారికి జరిగే నష్టాల గురించి తెలియజేయాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు సైకలాజికల్‌గా బాధపడుతున్న వారిని గుర్తించి మహిళా పోలీసు, ఐసీడీఎస్, మెడికల్ డిపార్ట్మెంట్ వారు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి మనోధైర్యం చెప్పాలన్నారు. వివాహాలు జరిగే చర్చి, టెంపుల్, కల్యాణ మండపాలు, వివిధ మందిరాల్లో జరిగే సమయంలో వివాహం చేసుకున్న వారి వయసుకు సంబంధించిన పత్రాలను చూసి ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం వయసు ఉంటేనే వారికి వివాహం చేయాలన్నారు. గ్రామాల్లోని పాఠశాలల్లో మిడ్‌డే మిల్స్, శానిటేషన్, తాగునీరు వివిధ అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకొని వాటిపై మానిటరింగ్ చేయాలన్నారు. కార్యాలయ రికార్డు రూమ్ భద్రతపై ఆరా తీశారు. కార్యాలయంలో సీసీ ఫుటేజ్ ఏర్పాటు చేసి, పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో వసుందర, డిప్యూటీ డీఎంహెచ్వో సత్యవతి, డిప్యూటీ డీఈవో వెంకట రమణ రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, డివిజన్‌లోని తహసీల్దారులు ఎంపీడీవోలు, సీడీపీవోలు అధికారుల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్, పాల్గొన్న అధికారులు

కేంద్ర ప్రభుత్వ విధానాలపై రైతుల నిరసన

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 9: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేటర్లను తరిమి కొడదామని ఏఐకేఎస్, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలో ర్యాలీలు నిర్వహించారు. నాయకులు పంపన్నగౌడు, తిమ్మగురుడు, వీరేష్, రాముడు, రామాంజనేయులు, రాజు, నరసయ్యలు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ఆత్మహత్యలు లేకుండా చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సూచన ప్రకారం మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ హామీలు అమలు చేయకపోగా మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగాలకు అప్పజెప్పేందుకు మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకువచ్చారన్నారు. ఆ చట్టాలు అమలు అయితే రైతులకు ఇప్పటి వరకు ఉన్న కనీస మద్దతు ధర చట్టం కూడా లేకుండా పోతుందన్నారు. అలాగే కార్మిక చట్టాలు నిర్వీర్యం చేస్తూ కార్మికులతో వెట్టిచాకిరి చేయించడానికి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తున్నారని, దీనివలన కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు రాజు, గోవర్ధనమ్మ, నాగలక్ష్మీ, భాస్కర్‌యాదవ్, రంగన్న, కేసీ జబ్బార్, శాంతప్ప, మాలిక్, విజయేంద్ర, రాజు, తిమ్మప్ప, జైపాల్, సురేష్, ఆదీ, నల్లన్నలతో పాటు ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆస్పరి: రైతాంగం పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు అన్నారు. శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక రైతు సంఘం ఆఫీసు నుండి ర్యాలీగా బయలుదేరి ఆస్పరి అంబేడ్కర్ సర్కిల్ నందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బీ.రామాంజినేయులు, నరేంద్ర, నాగరాజు, రైతు సంఘం సీనియర్ నాయకులు రంగప్ప, జయన్న, యాటకల్లు మునిస్వామి, నారాయణ, ఆటో యూనియన్ నాయకులు కుమార్, రమేష్, వీరేష్, మహానంది, శ్రీకాంత్ పాల్గొన్నారు.


ఆదోనిలో వామపక్ష నాయకుల ర్యాలీ

ఆదోని (అగ్రికల్చర్): ప్రభుత్వ రంగ సంస్థలలో కార్మిక చట్టాలను మార్పు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి వెంకప్ప, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం పురపాలక మైదానం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కార్మిక సంఘ నాయకులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశులు లక్ష్మిరెడ్డి, ఈరన్న, తిప్పన్న, షేక్షావలి, మునెమ్మ, భీమేష్, రాజు తిక్కప్ప రామాంజినేయులు శేఖర్ పాల్గొన్నారు.

వెల్దుర్తి: కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి దారులకు సంపదను దోచిపెట్టే నిర్ణాయాలను తీసుకోవడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం కిట్ ఇండియా నిరసన డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లి, మాదన్న, దశరథ్, మద్దయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కౌతాళం, ఆగస్టు 9: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మండల దళిత నాయకులు జగదీష్, రంగప్ప, సురేష్, హనుమంతులు అన్నారు. శుక్రవారం ఎరిగేరిలో అంబేడ్కర్ విగ్రహానికి దళితులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం కౌతాళంలోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నిరసన తెలిపారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే ఏపీఆర్‌జేసీ లక్ష్యం

ఎమ్మిగనూరు, ఆగస్టు 9: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభ ఉన్న విద్యార్థినులను గుర్తించి ఉన్నత శిఖరాలకు చేరుకునే విధంగా తీర్చిదిద్దడమే ఏపీఆర్‌జేసీ లక్ష్యమని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు మండలం లోని బనవాసి ఏపీఆర్‌జేసీ కళాశాల ఆవరణలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఆహ్వాన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా 94వ బ్యాచ్ విద్యార్థినులు ఈ కళాశాలలో విద్యను పూర్తి చేసి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గిరివాణి, శ్రీదేవి, సౌజన్యలత, సుజాత, శ్రీధర్, మద్దిలేటి, ఫిజికల్ డైరెక్టర్ సుకన్య, నారాయణస్వామి, రేవతి, స్వర్ణ, ఎంబీ రమణ, సునీత, ధనలక్ష్మి, భారతి, మౌనిక, శివమ్మ పాల్గొన్నారు.

దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీ కృషి

పత్తికొండ, ఆగస్టు 9: దేశ ప్రయోజనాల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిరంతర కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కనిగిరినీలకంఠ, రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి అంకాల్‌రెడ్డి అన్నారు. హర్‌ఘర్‌తరంగ్ జిల్లా సన్నాహక సమావేశం పత్తికొండ అసెంబ్లీ కోకన్వీనర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో జరిగింది. వారు మాట్లాడుతూ దేశంలో స్వాతంత్ర దినోత్సవాన్ని అందరూ జరుపుకోవాలన్న సిద్ధాంతంతో హర్‌ఘర్ తరంగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయండి

ఆలూరు రూరల్, ఆగస్టు 9: పాఠశాలల విద్యా అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ జిల్లా కార్యదర్శి కటారు కొండ శీనప్ప, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామనాథ్ యాదవ్, మండల కన్వీనర్ అశోక్ యాదవ్, కురవ హనుమప్ప, కే దేవేందప్ప, సర్పంచి బురిజింటి ఎల్లప్ప అన్నారు. శుక్రవారం మొలగవల్లి కమ్మరచేడు, మరకట్టు, పెద్దహోతూరు చైర్మన్‌లు చిలక సురేష్, కురవ శివరామ్, కురవ మహకాంళమ్మ, కొట్టం శ్రీనివాసులును టీడీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మన్న, మహీధర్ రెడ్డి, కురవ రామంజినేయులు, ఆంజనేయ, యంకన్న, మాణిక్య రెడ్డి, మోక మల్లయ్య, వెంకటేశ్వర్లు, ఉసేని, బసవరాజు, కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐగా శ్రీనివాసులు



ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 9: ఎమ్మిగనూరు మండల ఎస్ఐగా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి బదిలీల్లో భాగంగా కర్నూలు వీఆర్‌కు వెళ్లారు. ఆదోని ఇస్వీ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న శ్రీనివాసులు ఎమ్మిగనూరు వచ్చారు.

కస్తుర్బాగాంధీ పాఠశాల ప్రిన్సిపాల్‌ను తొలగించాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు9: ఎమ్మిగనూరు లోని కస్తుర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్, ఉదయ్, సోమశేఖర్, సురేష్‌లు డీఈఓను కోరారు. శుక్రవారం కర్నూలులో డీఈఓ శ్యామ్యూల్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. పాఠశాలలో విద్యార్థినులకు సరైన భోజనం అందించకుండా అక్రమాలకు పాల్పడిన ప్రిన్సిపాల్‌పై 15 రోజుల క్రితం జిల్లా విద్యాధికారులు విచారణ జరిపారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు 9: పట్టణంలోని 1వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆవార్డు కౌన్సిలర్ కామర్థి నాగేశప్ప మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కోరారు. శుక్రవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వార్డులో సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, పైప్‌లైన్ల లీకేజీల గురించి కౌన్సిల్ సమావేశాల్లో అధికారుల దృష్టికి తెచ్చినా పరిష్కరించడం లేదన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ నాగేశప్ప

ఇండోర్ స్టేడియం దుకాణానికి తాళం

ఆలూరు, ఆగస్టు 9: ఆలూరు పట్టణంలో ఇండోర్ స్టేడియం పరిధిలో ఉన్న 6 నెంబర్ దుకాణాన్ని జిల్లా అధికార్ల ఆదేశాల మేరకు తాళాలు వేసి స్వాధీనం చేసుకున్నట్లు ఇండోర్ స్టేడియం నిర్వాహకుడు ధనుంజయ్ తెలిపారు. షాప్‌పై వచ్చిన ఫిర్యాదులు, ఘర్షణలను పరిగణలోకి తీసుకొని షాప్‌ను స్వాధీనం చేసున్నట్లు తెలిపారు. ఆ షాప్‌పై సర్వాధికారాలు జిల్లా స్పోర్ట్స్ అథారిటీకి ఉంటాయని అన్నారు.

ఆస్పరి సీఐగా మస్తాన్ వలి

ఆస్పరి, ఆగస్టు 9: ఆస్పరి అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్‌కు సీఐగా మస్తాన్ వలి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లాలోని బాకరాపేట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ హనుమంతప్ప చిత్తూరు జిల్లాలోని ఎస్సార్ నగర్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

వార్డు సమస్యలపై స్పెషల్ డ్రైవ్

ఆదోని టౌన్, ఆగస్టు 9: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో వారి నుండే తెలుసుకోవడం కోసం మునిసిపల్ కమీషనర్ రామచంద్ర రెడ్డి ఆయా వార్డులలో సిబ్బందితో కలిసి పర్యటిస్తున్నారు. శుక్రవారం 9వ వార్డులోని హవన్న పేటలో పర్యటించి ప్రజలతో నేరుగా మాట్లాడుతూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకొన్నారు. సమస్యలపై అక్కడే సిబ్బందికి ఆదేశాలను జారీ చేసారు. పారిశుద్ధ పనులు అమలులో ప్రజలు కూడా సిబ్బందికి సహకరించాలని కోరారు.

డ్రైనేజీ పైపును ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 9 : ఎమ్మిగనూరు పట్టణంలో సున్నం బట్టి సమీపంలో ఉన్న మహిళల పబ్లిక్ మరుగుదొడ్డికి మలం వెళ్లే డ్రైనేజీకి పైపు ఏర్పాటు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సమీవుల్లా ఏఐటీయూసీ తాలుకా అధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. కార్యక్రమంలో రామాంజనేయులు, ఖాజా, సుంకన్ననరసింహులు పాల్గొన్నారు.

బంటనహాల్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి

చిప్పగిరి, ఆగస్టు 9: బంటనహాల్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన కానిస్టేబుల్ బాస్కర్, మల్లికార్జున, పులికొండ, రంగస్వామి, రమేష్ బాబు, నాగార్జున కోరారు. శుక్రవారం గుంతకల్ డిపో మేనేజర్ నాగరాజు గౌడ్‌కు గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించి ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రశాంత జీవనం సాగించాలి: ఎస్పీ

దేవనకొండ, ఆగస్టు 9: ఫ్యాక్షన్ వీడి ప్రశాంత జీవనం సాగించాలని ఎస్పీ బిందుమాదవ్ అన్నారు. శుక్రవారం కప్పట్రాళ్ల గ్రామంలో ఎస్పీ ఆకస్మికంగా పర్యటించారు.గ్రామంలోని పీర్లచావిడి వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గతంలో జిల్లాలో పెరుగాంచిన ఫ్యాక్షన్ గ్రామామైన కప్పట్రాళ్లలో నేడు ప్రశాంత వాతావరణం చూస్తుంటే జిల్లాకే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. దతత్త పుత్రుడు ఎస్పీ ఆకె .రవికృష్ణ చొరవతో గ్రామాభివృద్ధి జరిగిందని కొనియాడారు. గత ప్రభుత్వంలో రీ సర్వేతో పొలాలలో సమస్యలు నెలకొన్నట్లు గ్రామస్తులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.సీఐ శ్రీనివాసులును సమస్యలపై రెవెన్యూ అధికారులతో మాట్లాడాలని సూచించారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, సర్పంచు చెన్నమనాయుడు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ

పంట నమోదు తప్పనిసరి

ఆదోని రూరల్, ఆగస్టు 9 : పంట నమోదు కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ఆశోక్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గణేకల్లు, దొడ్డనగేరి, జాలిమంచిలో రైతుల పంట పొలాలను పరిశీలించి తప్పనిసరిగా రైతులు తాము వేసిన పంటలకు సంబంధించి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.


రైతులతో మాట్లాడుతున్న ఏవో

ఇస్వీ ఎస్ఐగా నాగేంద్ర



ఆదోని రూరల్, ఆగస్టు 9 : ఆదోని మండలం ఇస్వీ ఎస్.ఐగా నాగేంద్ర బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐల బదిలీలో భాగంగా త్రీటౌన్‌లో విధులు నిర్వహిస్తున్న నాగేంద్ర ఇస్వీ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. శుక్రవారం ఎస్ఐ మాట్లాడుతూ కర్ణాటక మద్యం విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, గ్రామాల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే

మద్దికెర, ఆగస్టు 9: మండలంలో పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్లుగా ఎన్నికైనవారు పాఠశాలల విద్యాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల చైర్మన్లుగా ఎంపికైన బులాపురం చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, మాజీ జడ్పీటీసీలు జమేదార్ రాజన్న యాదవ్, పి.పురుషోత్తం చౌదరి, టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం రామాంజులు, పెరవలి రామాంజులు, బాషా, విశోభ, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసిన టీడీపీ విద్యాకమిటీ చైర్మన్లు

ఎమ్మెల్యే సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి

తుగ్గలి, ఆగస్టు 9: పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నూరి, రాంపల్లి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి పూలమాలలు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాములు, మోహన్, మాజీ సర్పంచ్ చంద్రన్న, ఫక్కీరప్ప, ఎస్ఎంసీ చైర్మన్ పురుషోత్తం, రాంపురం మల్లయ్య, గిరిగిట్ల మల్లి తదితరులు ఉన్నారు.

గ్రామ సమస్యలపై పవన్ అధ్యయనం

● జనసేన ఇన్‌చార్జి వెంకప్ప

ఆలూరు, ఆగస్టు 9: గ్రామ సమస్యలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తున్నాడని త్వరలోనే గ్రామాల రూపురేఖలు మారబోతున్నాయని జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ వెంకప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి నిధులు విడుదల అయ్యాయన్నారు. త్వరలోనే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు రంజిత్, వీరేష్, వీరశేఖర్, చత్రపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జన సేన ఇన్‌చార్జి వెంకప్ప

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

ఆదోని టౌన్, ఆగస్టు 9: టీడీపీ నాయకుడు ఎండీ భద్రీనాథ్ స్వామి (56) అనే వ్యక్తి గురువారం మృతి చెందాడు. శుక్రవారం కల్లు మఠం పీఠాదిపాతి గురు శిద్ద దేవరు, ఎమ్మెల్యే డా. పార్థసారథి, టీడీపీ మజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, సీనియర్ టీడీపీ నాయకులు మదిరే భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీమ్, టీడీపీ వీరశైవ సాదికార సమితి రాష్ట్ర కన్వీనర్ శివరాజ్, కన్నె జగదీష్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు దేవిశెట్టి ప్రకాష్, మార్కెట్ యార్డు మజీ చైర్మన్ మజహర్ మృతదేహం వద్ద నివాళి అర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

మంత్రాలయం, ఆగస్టు 9: మంత్రాలయంలో అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఎరుకుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్, ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎరుకలి కృష్ణ, మంత్రాలయం అధ్యక్ష కార్యదర్శులు బజారప్ప, కృష్ణమూర్తి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం ఆదివాసులకు హక్కుల సాధన కోసం పోరాటం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, వెంకటేశ్, అంజి, హనుమంతు, నూరి, లక్ష్మన్న, వెంకటేశ్, మాధన్న, నాగరాజు, మహేష్, భీమేష్, దేవేంద్ర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ గోపినాథ్

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

మంత్రాలయం, ఆగస్టు 9: మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి ఏపీ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న ఆత్మహత్య చేసుకున్న కురువ పార్వతి కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం, ఆర్‌యుఎస్ఎఫ్, డీఎస్‌వైఏ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మంత్రాలయం ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయి

మద్దికెర, ఆగస్టు 9: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని మండల విద్యాధికారి రంగస్వామి, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మండల సీపీఐ కార్యదర్శి ఎం.అగ్రహారం నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కమిటీ క్రీడా పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆంజనేయబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, సీపీఐ నాయకులు కోదండరాముడు, టీడీపీ నాయకులు శాంతిరెడ్డి, చెన్నంపల్లి మల్లికార్జున తదితరులు ఉన్నారు.

నాడు-నేడు పేరుతో రంగులు అద్దారు

- ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి


ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, ఆగస్టు 9: ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నాడు నేడు పేరుతో రంగులు వేసి నిధులు పక్కదారి పట్టించారని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని మాచాని సోమప్ప జడ్పీ బాలికోన్నత పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను హెచ్ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయినులు, సిబ్బంది సన్మానించారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద బాలికల పాఠశాల ఎమ్మిగనూరులో ఉండడం అదృష్టమన్నారు. అయితే ఆస్థాయిలో సౌకర్యాలు లేకపోవడం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడడం బాధాకరమన్నారు. పాఠశాల అభివృద్ధిపై విద్యాశాఖమంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళ్లి పాఠశాలను రాష్ట్రంలోనే నెంబర్ 1గా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మధుసుధనరాజు,పాఠశాలహెచ్ఎం కృష్ణమూర్తి, విద్యాకమిటీ చైర్మన్ రంగమ్మ, నాయకులు శిల్పి భాస్కర్ పాల్గొన్నారు.

కొత్త బస్సులు ప్రారంభం

ఆదోని టౌన్, ఆగస్టు 9: ప్రయాణికుల కోసం నాలుగు కొత్త బస్సులను ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో ఆయన కొత్త బస్సులను ప్రారంభించారు. రెండు బస్సులు బెంగూళూరుకు, మరో రెండు బస్సులు శ్రీశైలానికి వెళ్తాయని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రఫిక్, డిపో అధికారి రాఘవేంద్ర పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

క్లస్టర్ టీఏకు ఘన సన్మానం

తుగ్గలి, ఆగస్టు 9: తుగ్గలి మండలంలో టీఏగా పని చేస్తున్న వెంకప్పను ఘనంగా సన్మానించారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో పదోన్నతి పొందిన క్లస్టర్ టీఏ వెంకప్పను ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీపీ ఎర్రనాగప్ప, ఏపీవో రామకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఏలు ప్రదీప్, నరసింహ, మోహన్, తదితరులు పాల్గొన్నారు.